క్లుప్తంగా

స్వతంత్ర్య పాలస్తీనా ఏర్పాటుకు భారత్ మద్దతివ్వాలి



నిరసన ప్రదర్శన చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ఒంగోలు టౌన్: ఇజ్రాయిల్ దురాక్రమణను ఖండిస్తూ స్వతంత్ర్య పాలస్తీనా రాజ్యం ఏర్పాటుకు భారత ప్రభుత్వం మద్దతివ్వాలని సీపీఎం నగర కార్యదర్శి జి.రమేష్ కోరారు. శుక్రవారం స్థానిక గాంధీనగర్‌లో ఇజ్రాయిల్ దురాక్రమణను ఖండిస్తూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆవాజ్ నాయకుడు ఎస్డీ ముసేన్ అధ్యక్షత వహించగా, జిల్లా నాయకుడు ఎండీ యాసిన్, సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు తంబి శ్రీనివాసులు, షేక్ జాన్ బాషా, హరికృష్ణ, టి.దాసు, విశ్రాంత మున్సిపల్ కమిషనర్ షేక్ నబీ సాహెబ్, ముస్లిం సంఘాల నాయకులు పాల్గొన్నారు.

27న శ్రీగిరిలో అష్టోత్తర శత సహస్ర కలశాభిషేకం

ఒంగోలు మెట్రో: ఒంగోలు కొండమీద గల శ్రీగిరి వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 26, 27 తేదీల్లో కార్తీక మాస ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి తెలిపారు. 26వ తేదీ సాయంత్రం అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠ, మృత్సంగ్రహణం, కుంభ నివేదనం, ఉక్త హోమం నిర్వహిస్తారు. 27వ తేదీ సోమవారం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఉదయం కుంభ పూజ, పూర్ణాహుతి, ఉదయం 8.30 గంటలకు శ్రీవారికి అష్టోత్తర శత సహస్ర కలశాభిషేకం, సాయంత్రం కార్తీక దీపోత్సవం జరుగుతాయని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

నిస్సహాయుల జీవనానికి సహాయం

ఒంగోలు అర్బన్: ఇంటి పెద్దను కోల్పోయి నిస్సహాయ స్థితిలో ఉన్న కుటుంబానికి సూర్యశ్రీ ట్రస్టు జీవనం కల్పించేలా ఆర్థిక, వస్తు సహాయం అందించారు. నాగులుప్పలపాడు మండలం మట్టిగుంట గ్రామానికి చెందిన రావూరి అశ్విని భర్త సతీష్ ఏడాది క్రితం మరణించడంతో ఇద్దరు పిల్లలతో కలిసి జీవనం సాగించేందుకు వీలులేక ఇబ్బందుల్లో ఉంది. ట్రస్టును సంప్రదించగా, ఇస్త్రీ చేసుకుని జీవించేందుకు రూ.30 వేలతో ఇస్త్రీ పెట్టె, నాలుగు చక్రాల బండితో పాటు నిత్యవసర సరుకులను శుక్రవారం ట్రస్టు కార్యాలయంలో అందజేశారు. దాతలు ప్రమోద్ మన్యం రూ.15 వేలు, శిల్పా రాఘవేంద్ర రూ.10 వేలు, నరేంద్ర చింతం రూ.5 వేల ఆర్థిక సహకారంతో వాటిని సమకూర్చినట్లు ట్రస్టు సెక్రటరీ సర్దార్‌బాష తెలిపారు.

క్రిస్మస్‌కు ప్రత్యేక గీతాల ఆల్బమ్

ఒంగోలు మెట్రో: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఒంగోలు జువెట్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చి కమిటీ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ వై.స్వరూప్‌కుమార్, ట్రెజరర్ పాలేటి జెరూషా ఆధ్వర్యంలో ప్రత్యేక గీతాల ఆల్బమ్ రికార్డింగ్‌ను ఒంగోలులో ప్రారంభించారు. కుంపటి క్రిష్టాఫర్ ఈ పాటలను రచించగా కుంపటి సోమయాజులు స్వరకల్పనతో పాటు సంగీతం అందించారు. ప్రముఖ గాయకుడు నూకతోటి శరత్‌బాబు, విజయ్, పూర్ణిమ, చింతా రమేష్ గీతాలను ఆలపిస్తున్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆల్బమ్ చేస్తున్నందుకు ఆనందంగా ఉందని సోమయాజులు, రికార్డింగ్ థియేటర్ ప్రతినిధి దానం కేరి తెలిపారు. వారంలో ఆల్బమ్ విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక

చీమకుర్తి: సంతనూతలపాడు నియోజకవర్గం, మండలం ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గాలను శుక్రవారం చీమకుర్తిలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షునిగా జంగ్రాజుపల్లి బాలరాజు, మండల కన్వీనర్‌గా బక్కా రాజు, చీమకుర్తి పట్టణ కన్వీనర్‌గా పాటిబండ్ల చిన్నను ఎన్నుకున్నారు. స్టూడెంట్ ఫెడరేషన్ కన్వీనర్‌గా అత్యాల చిన్న ఏసు, మండల సలహాదారుగా బొంతా భాస్కర్, కో కన్వీనర్‌గా పాటిబండ్ల కిషోర్, కార్యదర్శిగా పాటిబండ్ల ఆనంద్‌ను ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రావినూతల కోటి, కొమ్మూరి గరటయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నూతన కమిటీ ఎన్నిక సందర్భంగా వారు మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు అలుపెరుగని పోరాటం సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మల్లెల ప్రసాద్, నాగార్జున, సీమోను, రోశయ్య, స్థానికులు పాల్గొన్నారు.

బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో ర్యాలీ

ఒంగోలు సెంట్రల్: బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం ఒంగోలులో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎస్సీ మోర్చా అధ్యక్షుడు పెరిక లక్ష్మణ్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. పీఎం నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసే దేవానందం తదితరులు పాల్గొన్నారు.



గమళ్లపాలెం సచివాలయంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న జాలిరెడ్డి, ఉమామహేశ్వరి, సుజాత, బాలచెన్నయ్య



ముక్తినూతలపాడులో ప్రభుత్వ పథకాల కరపత్రాలు అందజేస్తున్న రాయపాటి అంకయ్య



అన్నంగిలో పథకాల పట్టికను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, మండవ అప్పారావు, నాయకులు

జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలి

మద్దిపాడు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జగనన్నే ముఖ్యమంత్రి కావాలని మద్దిపాడు ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని అన్నంగి గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కుల, మత, ప్రాంత, పార్టీ విభేదాలు లేకుండా అర్హులైన లబ్ధిదారులకు పథకాలు వర్తింపజేస్తూ ప్రజారంజకమైన పాలన సాగిస్తున్నందుకు, పేద, బడుగు, బలహీనవర్గాలకు అండగా నిలుస్తూ వారికి ఆర్థికంగా చేయూత అందిస్తూ వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నందుకు ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే కావాలని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో కేవలం జన్మభూమి కమిటీల ప్రాపకం ఉన్నవారికే పథకాలు అందాయన్నారు. జన్మభూమి కమిటీల పేరుతో రాష్ట్రంలో టీడీపీ అరాచకాలు చేసిందన్నారు. ప్రస్తుతం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాల పేర్లు మారుస్తూ అమ్మ ఒడి పేరును తల్లికి వందనం అంటూ కాపీ పేస్ట్ చేసి మేనిఫెస్టో తయారు చేస్తున్నారని టీడీపీ అధిష్ఠానాన్ని విమర్శించారు. ఒక్క అన్నంగి గ్రామంలోనే డీబీటీ, నాన్ డీబీటీ పద్ధతుల ద్వారా రూ.18.90 లక్షలు ఈ నాలుగున్నరేళ్లలో లబ్ధి చేకూరిందని, ఇవి కాకుండా గ్రామ అభివృద్ధి పనులకు మరో రెండు కోట్లు వచ్చాయని తెలిపారు. ఎన్ని వెర్రి వేషాలు వేసినా చంద్రబాబును ప్రజలు విశ్వసించని పరిస్థితి ఉందన్నారు. పలువురు వక్తలు మాట్లాడుతూ జగనే ఎందుకు ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా ఉండాలో పలు ఉదాహరణలతో ప్రజలకు వివరించారు. అనంతరం పథకాల పట్టికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మండవ అప్పారావు, జేసీఎస్ కన్వీనర్ బత్తుల శ్రీనివాసరావు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, గుడ్డపాతల రవి, వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు, రాయపాటి రమేష్, వెంకటాద్రి, తేళ్ల పుల్లారావు, దుడ్డు వినోద్, బొమ్మల రామాంజనేయులు, పల్లపాటి అన్వేష్, జయమ్మ, గ్రామ సర్పంచ్ పల్లపాటి లోకేశ్వరి, ఎంపీటీసీ రాయపాటి వెంకట సుజాత, రాయపాటి వెంకట సుబ్బయ్య, నారా సుబ్బారెడ్డి, సచివాలయ సిబ్బంది వలంటీర్లు, పలువురు నాయకులు, లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఎనికపాడులో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న దుంపా చెంచిరెడ్డి, నాయకులు

ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం

ఒంగోలు రూరల్: పేద, బడుగు, బలహీనవర్గాల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ముందుకు సాగుతోందని వైఎస్సార్ సీపీ ఒంగోలు నగర 16 డివిజన్ల కన్వీనర్ రాయపాటి అంకయ్య అన్నారు. శుక్రవారం ముక్తినూతలపాడులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. తొలుత దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సచివాలయ అడ్మిన్, నగర కార్పొరేషన్ అధికారి రామిరెడ్డి, వెల్ఫేర్ సిబ్బంది, శానిటరీ సిబ్బంది ముక్తినూతలపాడులో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో కూడిన ఫ్లెక్సీని ఆవిష్కరించారు. తొలుత బహిరంగ సభ నిర్వహించి మాట్లాడారు. రైతన్నలకు రైతు భరోసా క్రమం తప్పకుండా అందించారని, అర్హులైన వారికి జగనన్న ఆసరా, జగనన్న ఇళ్ల పట్టాలు, మత్స్యకారులకు వలలు, చేతిపని వారికి అవసరమైన రూ.10 వేలు, ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో పథకాలు అమలుచేశారని వివరించారు. అనంతరం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రతి గృహాన్ని సందర్శించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని ఎందుకు చేసుకోవాలో వివరించారు.

జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకుందాం

చీమకుర్తి: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకుంటేనే ఇప్పుడున్న సంక్షేమ పథకాలు నిరంతరం కొనసాగుతాయని వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి అన్నారు. శుక్రవారం ఎనికపాడు గ్రామంలో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయనతో పాటు ఎంపీపీ బీ.విజయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎనికపాడు గ్రామంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలను స్వీకరించిన తర్వాత ఇప్పటి వరకు ప్రత్యక్షంగా రూ.11.07 కోట్ల విలువ చేసే సంక్షేమ పథకాలు, రూ.5.77 కోట్ల విలువ చేసే అభివృద్ధి పనులు జరిగినట్లు వివరించారు. సంక్షేమ, అభివృద్ధి పనులకు సంబంధించిన బోర్డు, పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో దుంపా యలమందారెడ్డి, సర్పంచ్ తలారి వెంకట్రావు, ఎంపీటీసీ ఎల్.నాగేశ్వరరావు, స్థానిక నాయకుడు తలారి కోటయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగనే సీఎం కావాలి

కొత్తపట్నం: యథావిధిగా సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని మండల వైస్ ఎంపీపీ తాతా ఉమామహేశ్వరి, గమళ్లపాలెం సర్పంచ్ బద్దేల జాలిరెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని శుక్రవారం మండలంలోని గమళ్లపాలెం సచివాలయంలో నిర్వహించారు. తాతా ఉమామహేశ్వరి మాట్లాడుతూ గమళ్లపాలెం, వజ్జిరెడ్డిపాలెం కలుపుకుని సచివాలయం పరిధిలో రూ.23.50 కోట్ల సంక్షేమ పథకాల నగదు లబ్ధిదారుల అకౌంట్లలో జమ చేసినట్లు వివరించారు. ఎన్నో అభివృద్ధి పనులు కూడా చేసినట్లు చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వంలో అభివృద్ధి చేసిన దాఖలాలే లేవని విమర్శించారు. చెప్పిన పథకాలతో పాటు చెప్పని పథకాలను కూడా అమలు చేసినందుకు మళ్లీ ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావాలన్నారు. జాలిరెడ్డి మాట్లాడుతూ పేద, బడుగు, బలహీనవర్గాలకు అండగా ఉండి వారు ఆర్థికంగా ఎదగడానికి జగన్‌మోహన్‌రెడ్డి తోడ్పడ్డారని కొనియాడారు. ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత మాట్లాడుతూ గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు ఎన్నో రకాల సేవలు అందుతున్నాయని వివరించారు. మా నమ్మకం నువ్వే జగనన్న–వెల్ఫేర్ స్కీమ్స్ డిస్‌ప్లే బోర్డును జాలిరెడ్డి, ఉమామహేశ్వరి, సుజాత, బాలచెన్నయ్య, అధికారులు రిబ్బన్ కట్ చేసి ఆవిష్కరించారు. 38 రకాల అభివృద్ధి, సంక్షేమ పథకాలను నోడల్ అధికారి ఏ బాలచెన్నయ్య చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు తాతా శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ బలగాని నారాయణ, పంచాయతీ కార్యదర్శులు వి.బాలాజీనాథ్, మణిదీప్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందించిన మేయర్



లక్ష్మయ్య కుటుంబానికి వైఎస్సార్ బీమా నగదు అందిస్తున్న మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సబర్బన్: నగరపాలక సంస్థ పరిధిలోని చెరువుకొమ్ముపాలెంలో సహజ మరణం పొందిన ఎనిగేటి లక్ష్మయ్య కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకంలో మట్టి ఖర్చుల కోసం ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత రూ.10 వేలను శుక్రవారం అందించారు. స్థానిక తుఫాన్ నగర్‌లో నివాసం ఉంటున్న ఎనిగేటి లక్ష్మయ్య ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అదేవిధంగా చెరువుకొమ్ముపాలెంలో ఉన్న చెరువుపై వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి సంబంధించి పనులు చేపట్టాలని మేయర్‌ను స్థానికులు కోరారు. దీంతో నగరపాలక సంస్థ డీఈ పద్మజ, తదితరులతో కలిసి చెరువును మేయర్ పరిశీలించారు.

త్రోవగుంటలో ఎస్సీ బాలుర హాస్టల్ ప్రారంభం



విద్యార్థులకు ట్రంకు పెట్టెలు అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు

ఒంగోలు రూరల్: స్థానిక త్రోవగుంటలో సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఎస్సీ బాలుర హాస్టల్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ పార్వతి ఒంగోలు రూరల్‌లోని ఎస్సీ విద్యార్థుల బాలుర సంఖ్యను పరిగణలోకి తీసుకుని 3 నుంచి 10వ తరగతి వరకు ప్రవేశం ఉండేలా హాస్టల్‌ను సాంఘిక సంక్షేమశాఖ మంజూరు చేసిందని తెలిపారు. హాస్టల్ వార్డెన్ మాట్లాడుతూ నాణ్యమైన ఆహారం, పరిశుభ్రమైన వాతావరణం, ఆహ్లాదకరమైన స్టడీ అవర్‌తో సాంఘిక సంక్షేమశాఖ బాలుర వసతి గృహం నంబర్-3ను త్రోవగుంటలో నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ట్రంకు పెట్టెలు, ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనాన్ని అతిథుల సమక్షంలో ఏర్పాటు చేశారు. హాస్టల్ ప్రారంభ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సాంబయ్య, కట్టా గోపి, కె.ప్రభాకర్ రావు, కార్పొరేటర్ కె.సామ్రాజ్యం పాల్గొన్నారు. సాంబయ్య మాట్లాడుతూ ఎస్సీ పేద విద్యార్థులకు విద్యాభ్యాసంకు వసతి కల్పించడం ఎంతో సంతోషకరమన్నారు. కట్టా గోపి మాట్లాడుతూ పేద, బడుగుల అభ్యున్నతికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాటుపడుతోందని కొనియాడారు. కె.ప్రభాకర్ రావు మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ విద్యార్థులపై శ్రద్ధ వహించి వారికి వసతి గృహాన్ని త్రోవగుంటలో ఏర్పాటు చేయడం మంచి విషయమన్నారు. 1వ డివిజన్ కార్పొరేటర్ మాట్లాడుతూ ఎస్సీ విద్యార్థులు కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందుల వలన బడి మానేస్తున్నారని, అలాంటి వారికి ఈ హాస్టల్ ఎంతో సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. పక్కనే హైస్కూలు ఉండటంతో బడి మానివేసే వారి సంఖ్య ఉండదన్నారు. త్రోవగుంట హైస్కూలు హెచ్‌ఎం చల్లా బ్రహ్మయ్య మాట్లాడుతూ సాంఘిక సంక్షేమశాఖ వారు ప్రణాళికాబద్ధంగా రూరల్ గ్రామాల్లోని ఎస్సీ విద్యార్థుల భవిష్యత్తుని గుర్తుంచుకుని హాస్టల్ సౌకర్యం కల్పించడం అభినందనీయమన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి

● ఆర్డీవో విశ్వేశ్వరరావు



స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీవో విశ్వేశ్వరరావు

ఒంగోలు అర్బన్: 18 సంవత్సరాల వయసు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని అందుకు రాజకీయ పార్టీలు కృషి చేయాలని ఆర్డీవో విశ్వేశ్వరరావు కోరారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులతో స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై సమావేశం నిర్వహించారు. దీనిలో ఆర్డీవో మాట్లాడుతూ బీఎల్‌ఏలు, బీఎల్‌ఓలు సమన్వయంతో పనిచేసేలా చూడాలన్నారు. క్లెయిమ్‌లను పక్కాగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. దీనిలో ఎలక్షన్ డీటీ రఫీ, ఓఎంసీ ఏసీపీ వెంకటేశ్వర్లు, వైఎస్ఆర్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతి కుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు రాజశేఖర్, సత్యం, స్వరూప్, రసూల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థినులకు రూ.50 వేల ఫీజు అందజేత



నగదు అందిస్తున్న సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు

చీమకుర్తి: బొమ్మరిల్లు అనాథాశ్రమానికి చెందిన ఇద్దరు విద్యార్థినులకు నర్సింగ్ కాలేజీ ఫీజు కోసం సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం రూ.50 వేల నగదు అందించారు. ఒంగోలు, నెల్లూరు నర్సింగ్ కాలేజీలలో బొమ్మరిల్లు ఆశ్రమానికి చెందిన ఇద్దరు పేద విద్యార్థినులు చదువుతుండటంతో కాలేజీ ఫీజు కోసం సంతనూతలపాడుకు చెందిన సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు శనగల వెంకట రమణ ఆధ్వర్యంలో నగదు అందించారు. ఆశ్రమం నిర్వాహకులు ఖాసిం, ట్రస్ట్ తరఫున మల్లికార్జునరావు, శివయ్య పాల్గొన్నారు.

ఆహార పదార్థాల తయారీపై శిక్షణ



శిక్షణ పొందుతున్న మహిళలు

ఒంగోలు సెంట్రల్: తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాల తయారీపై జనశిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఒంగోలులో మహిళలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ కె.శ్యాం సునీల్ మాట్లాడుతూ పౌష్టికాహార లోపం వలన అనేక సమస్యలు వస్తాయని తెలిపారు. అందులో తల్లులు, పిల్లలకు కనిపించే దృష్టిలోపం, స్త్రీలలో రక్తహీనత, అయోడిన్ లోపం వంటివి ఉన్నాయన్నారు. ఆయా సమస్యల నుంచి బయట పడాలంటే నివాసంలో దొరికే వాటితోనే పౌష్టికాహారం తయారు చేసుకోవడం ఉత్తమమని అన్నారు. అనంతరం గోధుమ కిచిడి, ఆకుకూరలతో చపాతి, ఆకుకూరలతో అట్లు, అటుకులతో లడ్డు, రాగి లడ్డు, గోధుమ పాయసం వంటి పదార్థాల తయారీపై శిక్షణ ఇచ్చారు. ప్రోగ్రాం ఆఫీసర్లు డి.రాజేంద్ర ప్రసాద్, ఎం.హరికృష్ణంరాజు, మేనేజర్ పి.వెంకటేశ్వరరెడ్డి, ఇన్‌స్ట్రక్టర్ ఎం.నాగమల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర జట్టుకు ఒంగోలు క్రీడాకారిణి ఎంపిక



సాత్వికను అభినందిస్తున్న అధ్యక్షురాలు ప్రియ

ఒంగోలు సెంట్రల్: అండర్–13 నేషనల్ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఒంగోలుకు చెందిన చావల సాత్విక ఎంపికైనట్లు జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షురాలు ప్రియ తెలిపారు. అసోసియేషన్ ద్వారా పలు పోటీల్లో పాల్గొని సాత్విక ప్రతిభ చాటినట్లు చెప్పారు. రాష్ట్ర స్థాయిలో కూడా ప్రతిభ చాటాలని ఆకాంక్షిస్తూ అధ్యక్షురాలితో పాటు అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ కిషోర్, సెక్రటరీ రవి అభినందనలు తెలిపారు.

వేగంగా ఉలిచి చెరువు ఆధునికీకరణ



ఆధునికీకరణ పనులు జరుగుతున్న ఉలిచి చెరువు

ఒంగోలు రూరల్: పురాతన ఉలిచి చెరువును ప్రజాప్రతినిధులు, దాతల ఆర్థిక సాయంతో వేగంగా ఆధునికీకరిస్తున్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు చుంచు రామకృష్ణ, సర్పంచ్ మంచు మురళి, ఆదిశేషయ్య, మదన్‌మోహన్, కార్యదర్శి సురేష్‌కుమార్ పర్యవేక్షణలో పనులు వేగంగా చేస్తున్నారు. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు ఉలిచి గ్రామ చెరువును సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు వారు తెలిపారు. తొలుత చెరువులో జేసీబీతో పూడిక తీయడంతో నీటి నిల్వ సామర్థ్యం పెరిగింది. ఆ మట్టిని చెరువు ఆనకట్టలకు వేసి రోడ్డు రోలర్‌తో ఆనకట్టలను పటిష్టం చేశారు. ప్రమాదాలు జరగకుండా చుట్టూ ఇనుప కంచె వేయనున్నారు. చెరువును వాకింగ్ ట్రాక్‌గా ఉపయోగించేందుకు ట్రాక్ నిర్మాణం చేపట్టి మొక్కలు వేయనున్నట్లు తెలిపారు. పనులు పూర్తయిన తర్వాత ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రారంభించి పక్కనే ఉన్న గుండ్లకమ్మ నది నుంచి చెరువుకు నీటిని విడుదల చేస్తారని వెల్లడించారు.

కార్మికులను బానిసలుగా మార్చేందుకు మోదీ కుట్ర



సమావేశంలో ప్రసంగిస్తున్న శ్రీనివాసరావు

ఒంగోలు టౌన్: ఎన్నో పోరాటాలు, ఎందరో ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసి కార్మికులను బానిసలుగా మార్చేందుకు కేంద్రంలోని మోదీ సర్కార్ ప్రయత్నిస్తోందని సీఐటీయూ అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు విమర్శించారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన ఫెడరేషన్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను సవరిస్తూ ప్రైవేటీకరణకు పాల్పడుతోందన్నారు. కనీస వేతన చట్టం అమలు చేయకుండా యూనియన్లు పెట్టుకునే హక్కులు లేకుండా చేస్తోందని మండిపడ్డారు. తద్వారా కార్మికులను బానిసలుగా మార్చి పరిశ్రమల యజమానులకు, పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్చేందుకు కుయుక్తులు పన్నుతోందని చెప్పారు. కార్మికశక్తిని నిర్వీర్యం చేస్తున్న మోదీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకు కార్మికులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో చీకటి శ్రీనివాసరావు, షేక్ ఖాదర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను పరిశీలించిన కమిషనర్



పారిశుధ్య సిబ్బందికి సూచనలు చేస్తున్న కమిషనర్

ఒంగోలు సబర్బన్: నగరంలో పారిశుధ్య పనులు, అభివృద్ధి పనులను కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. పాత గుంటూరు రోడ్డుతో పాటు కర్నూలు రోడ్డు ఫ్లైఓవర్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ సెంటర్, అద్దంకి బస్టాండ్ సెంటర్, పాత మార్కెట్, కొత్తపట్నం బస్టాండ్ సెంటర్, కలెక్టర్ బంగ్లా రోడ్డు, ప్రకాశం భవన్ ముందున్న ట్రంక్ రోడ్డు వరకు జరుగుతున్న పారిశుధ్య, నగర సుందరీకరణ, మరమ్మతు పనులను పరిశీలించి సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. పనుల్లో లోపాలుంటే కాంట్రాక్టర్‌పై చర్యలు తప్పవని హెచ్చరించారు. డివైడర్లలో చేపట్టిన మొక్కల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. 13వ డివిజన్ కబాడిపాలెంలో కాలువల్లో మురుగు తొలగించే కార్యక్రమాన్ని పరిశీలించారు. చెత్త సేకరణలో మూడు బుట్టల విధానాన్ని పాటించాలని సిబ్బందిని ఆదేశించారు. కమిషనర్ వెంట శానిటేషన్ సూపర్‌వైజర్ ఎస్.పిచ్చయ్య, డీఈ పద్మజ, ఒంగోలు నగరపాలక సంస్థ రెవెన్యూ, ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీటీడీ మన గుడి కార్యక్రమంలో ద్వాదశివ్రతాలు



గంగా అవతారంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తున్న తులసి

ఒంగోలు మెట్రో: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మాప్రచార పరిషత్ ఆధ్వర్యంలో దళితవాడల్లో నిర్వహిస్తున్న మన గుడి కార్యక్రమాల్లో భాగంగా ద్వాదశి వ్రతాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కైసిక ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని రెండు దళితవాడల్లో ఘనంగా మంగళకైసిక ద్వాదశి వ్రతం నిర్వహించారు. మార్కాపురం బాపూజీ కాలనీ శ్రీరామాలయం, త్రిపురాంతకం మండలం యెండూరివారిపాలెం రామాలయంలో ఉదయం నగరసంకీర్తన, హోమం, అర్చన, హరికథ, భజన సంకీర్తనలు నిర్వహించారు. అనంతరం ప్రసాదవితరణ చేశారు. అధిక సంఖ్యలో స్థానిక భక్తులు పాల్గొన్నారు. దాసుల సంక్షేమ అధ్యక్షుడు యామర్తి ధనుంజయరావు ఆధ్వర్యంలో యెండూరివారిపాలెంలో, సాయంత్రం గుండాయపాలెం శ్రీ అగస్త్యేశ్వరస్వామి దేవస్థానంలో నందిపాటి తులసి వారిచే గంగా అవతారం అనే అంశంపై ప్రవచనం జరిగింది.